

# యాసంగికి వేళాయె..

- పంటల ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- అత్యధికంగా సాగుకానున్న వరి, వేరుశనగ
- వర్షాభావంతో రైతుల వెనుకంజ
- గత సీజన్‌తో పోలిస్తే సాగు తగ్గుతుందని అంచనా

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ) : యాసంగి పంటల సాగుకు రైతన్నలు సిద్ధమయ్యారు. వానకాలం సీజన్ ముగిసి ధాన్యం విక్రయాలు చేసుకుంటున్న రైతులు యాసంగిలో పంటల సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈసారి వర్షాభావం, ప్రభుత్వం మారిన నేపథ్యంలో గత యాసంగితో పోలిస్తే సాగు గణనీయంగా తగ్గే అవకాశమున్నట్లుగా వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

**యాసంగి సాగు షురూ..**

యాసంగి సాగుకు వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. రైతులు గత సీజన్‌లో పండించిన పంటల ఆధారంగా వ్యవసాయశాఖ పంటల అంచనాను రూపొందిస్తుంది. ఈక్రమంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లోనూ పంటల సాగుపై ఓ అంచనాను తయారుచేశారు. దీని ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లాలో వరి, వేరుశనగ సాగుకు రైతులు అధికంగా ఆసక్తి చూపనున్నారు. కాగా గత యాసంగితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఈ వానకాలంలో వర్షాభావం వల్ల భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. బోర్లల్లో నీళ్లు రావడం లేదు. ఎగువన కృష్ణకు వరదలు రాకపోవడం, శ్రీశైలం జలాశయంలో ఆశించిన స్థాయిలో నీటి నిల్వ లేకపోవడం ఫలితంగా ఎంజీకేఎల్‌ఐ ద్వారా వచ్చిన నీటితో ఇప్పటికే నిండుగా, ఓ మోస్తరుగా నీళ్లతో ఉన్న చెరువులు కూడా రాబోయే కాలంలో అడుగంటే పరిస్థితులున్నాయి. దీంతో పంటలు చేతికొచ్చేటప్పటికి బోర్లల్లో కూడా నీళ్లు ఉండకపోవచ్చని వ్యవసాయ అధికారులు, రైతులు భావిస్తున్నారు. దీంతో ప్రస్తుత యాసంగి సీజన్‌లో పూర్తిస్థాయిలో పంటల సాగు చేపట్టకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రస్తుత పరిస్థితుల మేరకు ఈ సీజన్‌లో వ్యవసాయ శాఖ రూపొందించిన నివేదిక ప్రకారం వరి మినహాయిస్తే కేవలం 9,328ఎకరాలకు మాత్రమే ప్రణాళిక తయారు చేశారు. ఇంకా వరి పంట వివరాలను నమోదు చేయలేదు. అధికారులు ఎన్నికల పనుల్లో నిమగ్నమై ఉండటం, రైతులు కూడా గతానికి మించి సాగు చేయకపోవడంతో తాజా నివేదికల ప్రకారం 30 ఎకరాల్లోనే వరి పంట నమోదైంది. ఇప్పటివరకు తయారు చేసిన అంచనాల ప్రకారం వేరుశనగ 79,887 ఎకరాల్లో, జొన్న 668 ఎకరాల్లో, మొక్కజొన్న 1,601 ఎకరాల్లో, మినుములు 10,743 ఎకరాల్లో సాగు చేయనున్నారు. వేరుశనగ మరో 30వేల ఎకరాలకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. పూర్తిస్థాయిలో నివేదికల తర్వాత వరి పంట 1.20లక్షల వరకు సాగు చేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. కాగా గత సీజన్‌లో మొత్తం 3,12,096ఎకరాల్లో యాసంగి సాగు జరిగితే ఈసారి 3లక్షల ఎకరాలకు చేరడం కష్టంగానే కనిపిస్తోంది. వర్షాభావం, నీటి సమస్య యాసంగి సాగుపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉన్నది. గత సీజన్‌లో వేరుశనగ 1,17,813 ఎకరాల్లో సాగు చేయగా ఇప్పటి వరకు 79,897ఎకరాల్లో, వరి 1,55,553 ఎకరాలుండగా 1.20లక్షల ఎకరాలకు వస్తే గొప్పగా భావించే పరిస్థితులున్నాయి. జొన్న, మొక్కజొన్న, మినుములు, కందులు వంటి పంటల పరిస్థితి కూడా అదే స్థాయిలో ఉండే అవకాశముంది. దీనికితోడుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మారడంతో వ్యవసాయానికి సాగునీళ్లు, 24గంటల కరెంట్, మార్కెటింగ్, ఎరువులు, విత్తనాల పంపిణీ వంటి అంశాలపై ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయోనని రైతన్నలు యోచిస్తున్నారు. మొత్తం మీద యాసంగి పంటల సాగు గత సీజన్‌తో పోలిస్తే ఆశించినట్లుగా ఉండకపోవచ్చని తెలుస్తోంది.



**యాసంగి సీజన్ అంచనాలు**

| పంట | 2022 | 2023 |
|---|---|---|
| వేరుశనగ | 1,17,813 | 79,897 |
| వరి | 1,55,553 | 30 |
| జొన్న | 1,449 | 668 |
| మొక్కజొన్న | 20,942 | 1,601 |
| మినుములు | 13,776 | 10,743 |
| పత్తి | 227 | 0 |
| కందులు | 25 | 0 |

# భక్తులతో కిటకిటలాడిన శ్రీగిరి

- శ్రీశైలంలో కుండపోత వర్షం
- రద్దయిన లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి

శ్రీశైలం, డిసెంబర్ 4 : శ్రీశైల క్షేత్రంలో సోమవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా కుండపోత వర్షం కురుస్తున్నది. తుఫాన్ కారణంగా సాయంత్రం జరగాల్సిన కార్తీకమాస లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలు రద్దయినట్లు పీఆర్‌వో శ్రీనివాస్‌రావు తెలిపారు. కార్తీకమాసం మూడో సోమవారం స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన యాత్రికులతో పురవీధులు కిటకిటలాడాయి. తుఫాన్ కారణంగా భక్తులు జాగ్రత్తలతో క్షేత్రానికి చేరుకోవాలని ఈవో పెద్దిరాజు కోరారు.





కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పాతాళ గంగలో స్నానమాచరిస్తున్న భక్తులు

# ముగిసిన కురుమూర్తి రాయుడి బ్రహ్మోత్సవాలు

- స్వామివారి ఆభరణాలను అధికారులకు అప్పగించిన అర్చకులు
- ఆత్మకూర్ ఎస్‌బీఐలో భద్రపర్చిన ఆలయ అధికారి

దేవరకద్ర రూరల్ (చిన్నచింత కుంట), డిసెంబర్ 4 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బంగారు ఆభరణాలను గత నెల 18న స్వామివారికి అలంకరించారు. కాగా సోమవారం ప్రత్యేక పూజల అనంతరం మహా మంగళహారతులు సమర్పించి ఆభరణాలను తీసి వాటి స్థానంలో వెండి ఆభరణాలను అలంకరించారు. బంగారు ఆభరణాలను దేవాదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కార్యనిర్వహణ అధికారి మదనేశ్వర్‌రెడ్డి, తాసీల్దార్ కృష్ణయ్య, ఎస్సై శేఖర్, అమ్మాపూర్ సంస్థానాధీశులు శ్రీరాంభూపాల్, ఆలయ పాలక మండలి అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సభ్యుల సమక్షంలో దేవాదాయ అధికారులకు అప్పగించారు. అధికారులు ఆభరణాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆత్మకూర్ ఎస్‌బీఐ బ్యాంక్‌కు తరలించి భద్రపర్చనున్నట్లు ఈవో తెలిపారు. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవాల ఘట్టం ముగిసినట్లు పేర్కొన్నారు. కాగా అమావాస్య వరకు జాతర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

**భారీగా తరలొచ్చిన భక్తులు..**

బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సోమవారం కురుమూర్తి కొండకు భారీగా తరలొచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్నానాలు ఆచరించి, స్వామివారికి కొబ్బరి కాయలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా స్వామిదర్శనానికి క్యూలో భక్తులు బారులుదీరారు.



కాంచనగుహలో కొలువైన కురుమూర్తిస్వామి మూలవిరాట్



స్వామివారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు




ఆభరణాలను పరిశీలిస్తున్న అధికారులు



# చలికాలం.. జర పైలం

- పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు అవసరమంటున్న వైద్య నిపుణులు
- వ్యాధులు ప్రబలే అవకాశం
- ప్రాణాలకు పొంచి ఉన్న ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకోకుంటే అంతే!

బాలానగర్, డిసెంబర్ 4 : రోజురోజుకూ చలి పెరుగుతోంది. చలితోపాటు వ్యాధులు సైతం విజృంభిస్తాయి. జాగ్రత్తలు పాటించకుంటే ప్రాణాలకు ముప్పుతెస్తాయి. ఈ సీజన్‌లో ఎక్కువగా ఉబ్బసం, ఆయాసం, గుండె జబ్బులు ఇబ్బంది పెడతాయి. ఉదయం జాకింగ్, వాకింగ్‌కు వెళ్లాలంటే చర్మం పొడిబారి బిగుసుగా మారే అవకాశం ఉంటుంది. కాళ్ల మడిమలు, పెదాలు పగలడం వంటి సమస్యలొస్తాయి. ముఖ్యంగా పిల్లలపై చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వివిధ రుగ్మతలు ఉన్న వారు జాగ్రత్తలు పాటిస్తే చలికాలంలో వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో శరీరానికి మాయిశ్చరైజర్లు తప్పనిసరి. క్రీమ్ బెస్ట్ మాయిశ్చరైజర్లను ఉపయోగించడం మంచిది. ముఖం, చేతులు, కాళ్లకు రాసుకుంటే చర్మం మృదువుగా, కోమలంగా ఉంటుంది. చలికాలంలో వేధించే మరో సమస్య పెదాలు పగలడం. పెదాలు పగిలి రక్తం కారకుండా వ్యాజిలిన్, లిప్ బామ్ రాసుకోవాలి.





**చిన్నారులు జాగ్రత్త..**

చలికాలంలో చిన్నారులకు జబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చలి నుంచి రక్షణ కోసం స్వెట్టర్లను తొడిగించాలి. వేడినీటితో స్నానం చేయించాలి. ప్రయాణాలు తగ్గించుకోవడం మంచిది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పిల్లలకు ఇచ్చే అహారంలో ఆకుకూరలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.

**గుండెజబ్బులున్న వారు..**

చలికాలంలో గుండె జబ్బులున్నవారు, గుండె ఆపరేషన్ చేయించుకున్న వారు వాకింగ్ చేయొద్దు. చలిలో ఎక్కువగా తిరిగితే రక్తనాళాలు సంకోచించి గుండెకు సంబంధించిన సమస్యలు వస్తాయి. బీపీ, షుగర్ ఉన్నవారు కూడా ఈ జాగ్రత్తలు పాటిస్తే మంచిది.



**పాదాలు పగిలితే..**

చలికాలంలో ఎక్కువగా పాదాలు పగులుతాయి. ఉప్పునీళ్లు కలిపిన గోరు వెచ్చని నీటిలో పాదాలను పది నిమిషాలపాటు ఉంచాలి. ఆ తర్వాత సబ్బుతో శుభ్రంగా కడుక్కొని పొడిగుడ్డతో శుభ్రంగా తుడవాలి. విటమిన్-ఈ క్రీమ్ రాస్తే మంచిది. మధుమేహ వ్యాధిగ్రస్తులు డాక్టర్ల సలహాలు పాటించాలి.




**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

1. చలిగాలులు వీస్తున్న సమయంలో ఇంటి తలుపులు, కిటికీలను మూసి ఉంచాలి
2. శరీరానికి వేడిని కలిగించే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి.
3. నియంత్రించలేని వణుకు ఉంటే ముందే గుర్తించి చికిత్స తీసుకోవాలి.
4. ఆల్కహాలిక్, పానియాలను స్వీకరించరాదు. దాని వలన డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది.
5. పొలం పనులకు వేళ్లే వారికి చలి వల్ల, కాళ్లు చేతులు దురదలు పెడుతుంటాయి. కాబట్టి వాస్‌లైన్, చర్మక్రీమ్‌లు రాసుకోవడం ఉత్తమం
6. మందంగా ఉండే దుస్తులకంటే పలుచగా ఉండే దుస్తులను ధరిస్తే మంచిది. వేసుకున్న దుస్తులు బిగుతుగా ఉండేలా చూసుకోవాలి.
7. శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా ఉండేందుకు పొడి దుస్తులను ధరించాలి.
8. కిరోసిన్, దీపాలు దగ్గర ఉంచుకోరాదు. దీపాలను వినియోగించినట్లయితే వెంటిలేషన్ బాగా ఉండేలా చూసుకోవాలి.
9. వేడి పాలు, ఆహారం తీసుకోవాలి
10. మోటర్ సైకిల్‌పై తిప్పడం, విహార యాత్రలకు తీసుకెళ్లకూడదు.
11. పిల్లలు, వృద్ధులు చలికి బయటకు వెళ్లకుండా చూడాలి
12. గుండె సంబంధిత వ్యాధులున్న వారు అధిక పని చేయరాదు
13. చలికి పాదాలు పగులుతాయి. ముందు జాగ్రత్తగా ఉప్పునీటిలో లేదా గోరువెచ్చని నీటిలో 5 నుంచి 10 నిమిషాలు పాదాలను ఉంచాలి. పగుళ్లకు పసుపు, నిమ్మరసం వంటివి పూయకూడదు.

**గ్లిజరిన్ సబ్బులు..**

చలికాలంలో చర్మం తెల్లగా పొడిబారకుండా ఉండానికి గ్లిజరిన్ సబ్బులు వాడాలి. బాత్ సోప్ కూడా ఆయిల్ బేస్ట్‌తో ఉన్నవి వాడడం మంచిది. అప్పుడే చర్మం మృదువుగా ఉంటుంది. స్నానానికి ముందు ఆలివ్ ఆయిల్, తలకు కొబ్బరినూనెతో మసాజ్ చేసుకొని వేడినీటితో స్నానం చేయాలి. ఎక్కువ సేపు స్నానం చేస్తే చర్మం లోపలి కణాలు దెబ్బతింటాయి.






**ఉన్ని దుస్తులు..**

చలికాలంలో రాత్రివేళ తమ పని ముగించుకొని ఇంటికి వెళ్లేవారు, పనుల నిమిత్తం బయటకు వచ్చేవారు ఉన్ని దుస్తులు ధరించాలి. బ్రాండెడ్ దుస్తులు అయితే ఇంకా మంచిది. బైక్‌పై వెళ్లే వారు మంకీ క్యాప్, కాళ్లకు షూ, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలి.




**ఆస్తమా ఉంటే...**

చలికాలంలో ఆస్తమా ఉన్న వారు నిత్యం వాడే మందులను సిద్ధంగా ఉంచుకోవాలి. దుమ్ము, ధూళి పనులకు దూరంగా ఉండాలి. చల్లటి గాలికి తిరుగొద్దు. శ్వాసనాళాలు, మూసుకుపోకుండా డాక్టర్ సలహా మేరకు మందులు వాడాలి. ఇన్‌హేలర్, నెబ్యులైజర్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలి.







**జాగ్రత్తలుతీ సుకోవాలి**

చలికాలంలో ప్రజలు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉన్ని దుస్తులు ధరించాలి. బైక్‌పై వెళ్లే వారు మంకీ క్యాప్, కాళ్లకు షూ, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలి. వాస్‌లేన్ తప్పనిసరిగా వాడుకోవాలి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు కలగవు.

- లతీఫ్, ఆర్‌ఎంపీ, మొదంపల్లి, బాలానగర్ మండలం